
# వాన కురిసిన రాత్రి

చందు సోంబాబు



సాయంత్రంనుంచీ వర్షం కురుస్తూనే వుంది. తగ్గేలా లేదు. దానికితోడు గాలి విసురుకూడా ఎక్కువగానేవుంది.

రావుకి చికాగ్గావుంది. ఆ రాత్రి పది గంటలకి నాటకం ఆడాలి. ఫామిలీ ప్లానింగు నాటకాన్ని వరసగా కొన్ని వూళ్ళల్లో ఆడుతూ ఆ రోజు ఉదయమే వచ్చి అక్కడ టి. బి. లో దిగేడు రావు.

సిగరెట్టు వెలిగించి చేతిగడియారం వంక చూసుకొన్నాడు. ఏడవుతోంది.

టి. బి. కి వూరు రెండుమైళ్ల దూరం వుంటుంది. అక్కడ ఏర్పాట్లు చేయడానికి సాయంత్రమే మిగిలినవాళ్ళు వెళ్ళిపోయారు.

వర్షం తగ్గిపోతేగాని నాటకం ఆడ్డానికి వీల్లేదు. పల్లెటూరు కనక చలిగావున్నా, వర్షంపడుతోన్నా జనం ఎలాగూ వస్తారు.

ఎప్పుడోగాని ఇలాంటిదానికి నోచుకోని పల్లెజనానికి ఇలా దొరికిన అవకాశాన్ని వదులుకోవడం ఇష్టం వుండదు.

రావు సిగరెట్టు అవతలపడేసి కిటికీ వంక చూసేడు. అక్కడ సునంద నించునివుంది. సునంద ప్రొఫెషనల్‌గా నాటకాలువేసే మనిషి. రావుతోపాటుగా నాటకానికొచ్చింది.

రావు సునంద దగ్గరగా నడిచి,

"ఈవేళ నాటకం పడుతుందన్న నమ్మకంలేదు" అన్నాడు.

సునంద తలమాత్రం తిప్పి అతన్ని చూసింది.

"మరికొంతసేపట్లో తగ్గుతుందేమో" అంది.

రావు బయటికి చూసేడు. చీకటి నల్లగా, చిక్కగావుంది. కన్ను పొడుచుకొన్నా బయట ప్రపంచం ఏమీ కనబడ్డం లేదు.

గాలి విసురూ, వర్షంపడుతున్న శబ్దం తప్ప మరేమీ వినబడ్డంలేదు. తెలీడం లేదు.

అంతలో తళుక్కుమని ఓ మెరుపు కత్తిలా మెరిసింది. సునంద మొహం జేవురించిందప్పుడు.

రావు మరో సిగరెట్టు వెలిగిస్తూ అడిగేడు.

"ఫ్లాస్కులో కాఫీగానీ వుందేమో చూడు!"

సునంద అటుగా కదిలింది. టేబిల్ పైనవున్న ఫ్లాస్కుని చేతిలోకి తీసుకొని చూసి,

"లేదు" అంది.

"ఆకలిగావుంది. వూళ్లోకి పోతేగానీ తినడానికి ఏదీ దొరకదు" అన్నాడు.

సునంద అతనికి సమాధానం చెప్పలేదు. వెళ్ళి కుర్చీలో కూర్చుంది.

రావు తలుపు తీసుకొని వరండాలోకి వచ్చేడు. వాచమన్ సింహాద్రి చలిలో వరండాలో నేలపైన కూర్చునివున్నాడు.

రావుని చూస్తూనే సింహాద్రి లేచి నించున్నాడు.

"ఆకలిగావుంది. ఏమన్నా తెచ్చిపెట్టగలవా?" అడిగేడు.


సింహాద్రి వెంటనే మాట్లాడలేదు. ఓసారి చీకట్లోకి చూశాడు. వూరు రెండు మైళ్లుంది. వెళ్ళడానికి రెండు, రావడానికి రెండు మొత్తం నాలుగు మైళ్లు నడవాలి. ఎంతలేదన్నా ఓ గంటన్నర పడుతుంది. చీకటి, మట్టిరోడ్డు, మరోపక్క వర్షం. అదీగాక దారి అంతమంచిది కూడాకాదు.

"ఏమిటాలోచిస్తున్నావ్?" అడిగేడు రావు.

"దారిలో ఎలుగొడ్డులొస్తాయిదొరా."

వాడి మాటల్లో ఏదో భయం ధ్వనించింది.

రావు వింతగా చూసేడు సింహాద్రి వేపు. సింహాద్రికి వెళ్ళడం యిష్టంలేక తనతో అబద్ధం చెపుతున్నాడనిపించింది రావుకి.




"ఎలుగుబంట్లు ఈ వానలో ఎక్క డొస్తాయయ్యా. అయినా వెళ్లడం ఇష్టం లేకపోతే వెళ్లలేనని చెప్పు. అంతేగానీ కట్టుకథ లెందుకు?" రావు సింహాద్రితో మాట్లాడుతుండే సునంద గుమ్మంలో నుంచుని వింటోంది.

సింహాద్రి తలకు చుట్టిన తువాలు విప్పి వంటినిండా కప్పుకొన్నాడు. బొడ్లోంచి పొగాకు కాడని తీసి చుట్ట చుడుతూ నవ్వేడు.

"నమ్మకం లేకపోతే నేనేం చెప్పను. కానీ దొరా, ఇదివరక్కూడా దొరబాబు ఇలాగే అన్నాడు. నేనటు ఎల్లానోలేదో అదొచ్చి పడిందిట." రావు సింహాద్రి వంక కుతూహలంగా చూసి అడిగేడు.

''అప్పుడేమయిందేమిటి?'' రావు అడిగినదానికి సింహాద్రి చుట్ట వెలిగించి చెప్పాడు.

"ఆ. ఏముంది. ఆ దొరబాబు గుండె దిరిపోయి, పరుగుపుచ్చుకొన్నాడు. ముందు బాబుగోరు, ఎనక ఎలుగ్గొడ్డు. వూళ్లో అడుగుపెట్టేవరకూ ఎనక్కి తిరిగి సూత్తే ఒట్టు!''

"ఇదంత ప్రమాదకరమైన చోటవుతే నువ్విక్కడెందుకున్నట్టు?" అడిగింది సునంద.

సింహాద్రి బాధగా నవ్వేడు.

"మా మంచి మాట అడిగినావు తల్లీ. ఏదో పని లేకపోతే మాలాంటోళ్లకి ఎల్లమారేదెలా? బతుకుతెరువుకోసం పేణాలకి తెగించి పడున్నాను."

సింహాద్రి మాటలకు సునందకు జాలి కలిగింది.

''నీకు జీతమెంత?" రావు అడిగేడు.

''నెలంతా పడిగాపులు పడితే డెబ్బై. కొడుకు మిలిట్రీలోకి పోయాడు. కూతురు

మొగుడొదిలేస్తే, మనవరాలితోసహా వచ్చి పైనపడింది." సింహాద్రి తనకి చెందిన విషయాలు చెబుతూంటే సునందకి బాధ కలిగింది. రావు దూరంగా ఏదన్నా కారు వస్తుందేమోనని చూశాడు. కానీ ఏవిధమైన జాడా కనబడలేదు. వా న గా వుండడంచేత నాటకంగానీ ఆపేశారేమో అనుకొన్నాడు. లెక్కప్రకారం ఎనిమిది గంటలకి వాన్ రావాలి. ఎనిమిది కాలేదింకా.

రావు సునందవంక చూశాడు. అతని మొహంలోని భావాన్ని చదివిన దానిలా.

"వాన తగ్గేలా లేదు"అంది సునంద.

"నాటకం వుండదంటారా బాబూ?" అడిగేడు సింహాద్రి చుట్టతాలూకు పొగని గాలిలోకి వదులుతూను.

"పదిలోపు వర్షం తగ్గితే కనీసం పదకొండు గంటలకైనా వేసేయొచ్చు. కానీ వర్షం పడనిచ్చేలాలేదు! రావు మాటలకి సింహాద్రి ఎంచేతనోగానీ, నిరాశచెందినట్టుగా కనబడ్డాడు.

"సింహాద్రీ! నీకు తప్పదు. ఏదో ఒకటి తినడానికిగానీ, తాగడానికిగానీ, నువ్వు ఏర్పాటుచెయ్యక తప్పదు."

రావు మాటలకి సింహాద్రి పెద్ద యిబ్బందిలో పడ్డాడు.

"ఈ దిక్కుమాలిన వాతావరణంలో తను బయటకెళ్ళక తప్పదు. వె ళి తే సైకిలుపైనే వెళ్ళాలి. తప్పేలా లేదు. కానీ మట్టిరోడ్డుపైన సైకిలు నీళ్లలోనూ, బురదలోనూ నడవదు. వెళ్లననడానికి వీల్లేని, తన పరిస్థితికి నిస్పృహాయంగా రావువంక చూసి వాళ్ళు చెప్పినవి తేవడానికి గొడుగు పట్టుకొని బయల్దేరాడు సింహాద్రి.

అ త ను వెళుతోన్నవేపు చూ సి సునందతో అన్నాడు రావు.

"వెధవ, వెళ్లనని చెప్పలేక చిలవలు, పలవలు అల్లి కథలు చెప్తున్నాడు.ఇలాంటి వాళ్ల కెలా బుద్ధిచెప్పాలో నాకు తెలిపోతే కదా!"

సునంద మాత్రం అతని మాటల్ని తేలిగ్గా కొట్టిపారేసింది.

"ఛాల్లెండి పెద్ద! వాడిదిమాత్రం ప్రాణం కాదా! అదీకాక పెద్దవాడు. వానలో ఎలా వెళ్తాడు."

"ఇలాంటివాడు బ్రతికి ఎవర్ని ఉద్ధరించాలి. ఛస్తే దేశానికొచ్చిన నష్టం ఏమీ లేదులే" అన్నాడు.

సునంద రావువంక అసహ్యంగా చూసింది

"మనలాంటివాళ్లు పోతేమాత్రం దేశానికొచ్చిన నష్టం ఏమిటీ?" అన్నది.

"అందరి సంగతి ఏమోకానీ, నేను పోతే నీకు,నీవు పోతే నాకూ నష్టం. మనిద్దరం పోతే కళారంగానికి నష్టం" అన్నాడు నవ్వుతూ.

"ఛాల్లేండి పెద్ద. ఎప్పుడూ నాటకంలో మాటలే. వాడిదిమాత్రం మనిషిజన్మ



యువ

కాదా ? తోటిమనిషిపైన ఇంత జాలీ, కరుణావుంటే అపరాధం ఏమీకాదు," అంటూ చిరుకోపాన్ని ప్రదర్శించి లోప లకి నడిచింది.

రావుకూడా లోపలకి నడిచేడు. సునంద కాట్ పైన పడుకొని, అతనివేపే చూస్తోంది.

బయట గాలి విసురు తగ్గినట్టనిపించి, కిటికీదగ్గర కెళ్ళాడు రావు. వర్షంకూడా తగ్గిపోయింది. చేతిగడియారంవంక చూసుకొన్నాడు. ఎనిమిది దాటుతోంది.

''వర్షం తగ్గిపోయింది. ఇక మనం రెడీకావచ్చు" అన్నాడు రావు.

సునందలేచి కూర్చుని అన్నది.

"నేనుకూడా వాళ్ళతో వెళ్ళిపోయినా బాగుండేది. ఇక్కడ బోరుకొట్టి ఛస్తున్నాను."

"అవును. ఇక్కడ ఇలా దిక్కుమాలిన కాలక్షేపం చేయాల్సివస్తుందని ముందే తెలిస్తే, కూడా ఔషధం తెచ్చుకొనేవాడిని'' అన్నాడు రావు.

సునంద అతనివంక కోపంగా చూసి అంది.

''పాడు బుద్ధి పోనిచ్చారుకాదు. ఈ సారసలు నాటకానికి మీతో రానే రాను."

రావు అందంగా నవ్వి,

"నిన్నిబ్బంది పెట్టలేదనా కోపం?" అడిగేడు దగ్గరగా వస్తూ.

"ఛాల్లేండి. పతిగొడ్డుకి అరుపులెక్కువట. ముందు బయటకెళ్ళి చూడండి సింహాద్రి వస్తున్నాడేమో" అంది.

రావు చేతిగడియారంవంక చూసేడు. ఎనిమిదిన్నర అయింది. వరండాలోకి వెళ్ళి నించున్నాడు. వెనకగా సునంద కూడా వచ్చి గుమ్మంలో నించునివుంది.

వర్షం వెలిసింది. మరికొంతసేపట్లో వాన్ వస్తుంది. ఈలోగా సింహాద్రి రాగలిగితే బావుండును. అనుకొంటుండగానే ఎవరో వీపు తట్టినట్టయితే వులిక్కిపడ్డాడు. సునంద కెవ్వుమని అరిచి తలుపులు ధబాలున మూసేసింది. రావు పక్కనే ఎలుగుబంటి అతనిపైకి దూకడానికి సిద్ధంగా నిలుచునివుంది.

రావు బుర్ర పనిచెయ్యడం మానేసింది. సింహాద్రి మాటలను తను తేలిగ్గా కొట్టిపారేశాడు. ఇంత ప్రమాదాన్ని మాత్రం అతను శంకించలేదు. భయంతోపాటు వణుకు పుట్టుకొచ్చింది. తనిక తలుపు తట్టే అవకాశం కూడా లేదు. ఎలుగుబంటి పైనపడి పీకేస్తుంది ఆలస్యంచేస్తే.

సునందపైన చచ్చేంత కోపంవచ్చింది. కానీ ఏం చెయ్యగలడు ?

ఎవరి ప్రాణం వాళ్ళకు తీపి.

రావు రెండడుగులు వెనక్కివేసి తిరిగి చూడకుండా పరుగుపెట్టాడు: ఎలుగు కూడా ఆగకుండా రావు వెనకనే పరుగెత్తింది.

సునంద ఆ దృశ్యాన్ని చూసి బిక్కు బిక్కుమంటూ ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకొని కూర్చొంది గదిలో.

రావుని ఎలుగుబంటి ఏంచేసిందో అని భయంగావుంది. భయంతో ముందు తలుపులు మూసేసింది. అతను బయటవున్న విషయాన్ని కూడా విస్మరించి, అతని కేమన్నా అయితే? వూహించడానికే కంగారుగావుంది సునందకి.

ఓ అరగంట గడిచింది.

తలుపు తట్టిన చప్పుడయింది ఉలిక్కి పడింది. వూపిరిబిగపెట్టి వింది సింహాద్రి పిలుస్తున్నాడు.

"అమ్మగారు...అమ్మగారు" అని.

సునంద తలుపుతెరవకుండానే అడిగింది.

"ఎలుగుబంటి లేదుగా" అని.

'లేదు, తలుపు తెరువమ్మా' అన్నాడు సింహాద్రి.

తలుపు తెరిచిన సునందని చూసి సింహాద్రి తెల్లమొహం వేశాడు.

సునంద జరిగినదంతా అతనికి చెప్పి, వెక్కివెక్కి ఏడ్చింది.

సింహాద్రి అనునయంగా అన్నాడు.

"భయపడకు తల్లీ. బాబుగారు ఈ పాటికి వూరుచేరిపోయి వుంటారు. చెబితే వినేవాళ్లకయితే చెప్పొచ్చు" అంటూ ఫ్లాస్కు, పళ్లూ బల్లపైన పెట్టాడు.

సునంద పళ్లు తిని కాఫీ తాగింది.

"ఇంతలోనే వాన్‌వచ్చింది. అందులోంచి ప్రసాద్ దిగొచ్చాడు.

సునందా అంతా రెడీ. త్వరగా బయల్దేరు" అన్నాడు. సునంద ప్రసాద్ వంక అయోమయంగా చూసింది.

"రావుగారు......లేరు" అంది ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తోచక. ప్రసాదు నవ్వి-

"ఎంతగా ఆకలైతే మాత్రం వర్షంలో పడీ, లేచీ ఎవరు రమ్మన్నారు. రావుగారు అక్కడికి చేరాడులే. నువ్వు పద" అన్నాడు

సునంద బ్యాగ్ తీసుకొని, సింహాద్రికి చెప్పి వాన్ ఎక్కింది. సింహాద్రి కదిలి వెళుతోన్న వాన్‌వంక అసహ్యంగా చూసేడు. బంగళా వెనకవున్న ఓ కిటికీ దగ్గరికి నడిచి ఓ సంచీ పట్టుకొచ్చాడు. అందులోనించి ఎలుగుబంటి చర్మం తొడుగుని బయటికి తీసి చూసి నవ్వుకొన్నాడు సింహాద్రి.

"ఎధవనాయాల. అక్కడికి అది దొక్కడిదే పాణమైనట్టు. నాదీ పాణమే. ఎవడి ప్రాణం ఆడికి తీపి" అనుకొంటూ లోపలకి నడిచేడు. ఆ గదిలోవున్న అందమైన మంచాన్ని చూడగానే, సింహాద్రికి దానిపైన ఎక్కి పడుకోవాలనిపించింది.

